www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 4 మే 2025
5
వైఎస్ఆర్



హైకోర్టు జడ్జీలను కలిసిన కలెక్టర్, ఎస్పి

ప్రజాశక్తి - కడప



హైకోర్టు జడ్జీకి బొకే అందిస్తున్న కలెక్టర్, ఎస్పి

వైఎస్ఆర్ కడప జిల్లా కోర్టు ఆవరణలో శని, ఆది వారాల్లో నిర్వహించబోయే జ్యుడిషియల్ వర్క్‌షాప్, జ్యుడిషియల్ కాన్ఫరెన్స్ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు జడ్జీలు నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, బి.వి.ఎల్.ఎన్. చక్రవర్తిని శనివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పి అశోక్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. వారితో పాటు కడప జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి డాక్టర్ సి. యామిని, జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ హైకోర్టు జడ్జీలను కలిశారు.

నష్టం మిగిల్చిన గాలివాన

- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- పలు రైళ్లు ఆలస్యం
- అవస్థలు పడ్డ ప్రయాణికులు
- పలు గ్రామాలలో విద్యుత్ అంతరాయం



నేలకొరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



ఈదురు గాలుల ధాటికి రైల్వేస్టేషన్‌లో విరిగిన ఫ్యాన్ రెక్కలు

జమ్మలమడుగులో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులతో గాలి వాన బీభత్సం సృష్టించాయి. రైళ్ల రాకపోకలపై ప్రభావం చూపింది. ధర్మవరం మచిలీపట్నం రైలు, గుంటూరు తిరుపతి రైలు, తిరుపతి గుంటూరు రైళ్లు 5 గంటలు ఆలస్యంగా నడిచాయి. జమ్మలమడుగు - ప్రొద్దుటూరు మధ్యలో గూడ్స్ రైలు ఇంజన్ సమస్య రావడంతో రైళ్లకు ఆలస్యం కావడం ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జమ్మలమడుగు- ప్రొద్దుటూరు మధ్యలో సింగిల్ ట్రాక్ ఉండటంతో ఈ సమస్యకు మరొక కారణం. ఇది ఇలా ఉంటే శుక్రవారం 9 గంటలకు ఉరుములు, మెరుపులతో వర్షం, గాలి రావడంతో జమ్మలమడుగు రైల్వేస్టేషన్‌లో ఫ్యాన్లు మొత్తం దెబ్బతిన్నాయి. ప్రయాణికులు ఈదురు గాలులకు తట్టుకోలేక ఇబ్బందులు పడ్డారు. వేగంగా వీచిన గాలులకు రైల్వే లైన్ పైన ఉన్న విద్యుత్ లైన్ సమస్య తలెత్తింది. ధర్మవరం మచిలీపట్నం రైలుకు డీజల్ ఇంజన్‌తో బనగానపల్లె వరకు వెళ్లి అక్కడి నుంచి విద్యుత్ లైన్ సహకారంతో ట్రైన్ నడిచింది.



రైలు ఆలస్యం కావడంతో ప్లాట్‌ఫామ్‌పై నిద్రిస్తున్న ప్రయాణికులు

రెండవ ట్రాక్ ఏర్పాటు చేయాలి.. నిత్యం జమ్మలమడుగు నుంచి ఇటు తిరుపతి వైపు, విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం, ధర్మవరానికి వెళ్లే వారు ఒక ట్రాక్ ఉండటం వల్ల చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైల్వే అధికారులు సమస్యను గుర్తించి రెండవ లైన్ వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు..

జమ్మలమడుగు పట్టణం, మండల పరిధిలోని పలు గ్రామాలలో గాలి, వానకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో కరెంట్ లేక పిల్లలు, వృద్ధులు, ఉభకాయస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని బాలాజీ హైస్కూల్ వద్ద చెట్టు కొమ్మలు విరిగి విద్యుత్ లైన్స్‌పై పడటంతో బరువుకు పెద్దపసుపల మోటు సమీపంలో స్తంభం విరిగి పడింది.ఆ సమయంలో ఎవరు లేకపోవడం వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. వ్యవసాయ పరంగా నష్టం వాటిల్లలేదని మండల వ్యవసాయ శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. హార్టికల్చర్ అధికారి భరత్ కుమార్ రెడ్డి కూడా ఎలాంటి నష్టం లేదన్నారు.

32 స్తంభాలు ధ్వంసం..

జమ్మలమడుగు సబ్ డివిజన్ పరిధిలోని కొండాపురం మండలంలో 5, మైలవరం మండలంలో 6, జమ్మలమడుగు 2 రూరల లో అంబవరం సమీపంలో పాక్షికంగా 2 స్తంభాలు, పెద్దముడియం లో 4 , ముద్దనూరులో మూడు రోజుల కిందట 16 మొత్తం, సబ్ డివిజన్‌లో 32 స్తంభాలు ధ్వంసం కావడంతో విద్యుత్ సమస్య తలెత్తిందన్నారు. విద్యుత్ పునరుద్ధరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని ఎడి రాజ గోపాల్ తెలిపారు.

మోడీ మరోసారి మోసం చేశారు

ప్రధానివి దగాకోరు మాటలు
కడప ఉక్కు, కొప్పర్తి ప్రస్తావన సరే, నిధులు, పనులు ఎక్కడ?
సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

అమరావతిలో రెండవసారి రాజధాని నిర్మాణం కోసం దేశ ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారని, మరో మారు రాష్ట్ర ప్రజలకు అబద్ధాలు, బూటకపు మాటలు చెప్పారని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ విమర్శించారు. శనివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం నుంచి నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం కోసం నిధులు ఇతోధికంగా ఇచ్చామని బహిరంగ సభలో దేశ ప్రధాని అబద్ధాలు చెప్పారని పేర్కొన్నారు. నిజానికి కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రజలు కట్టిన టాక్స్‌లలో 50 శాతం పైగా రాష్ట్ర వాటాగా రావాల్సిన నిధులు కూడా సక్రమంగా ఇవ్వలేదని పేర్కొన్నారు. చంద్రబాబు కడప జిల్లాకు ఉక్కు పరిశ్రమ, కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి ప్రస్తావన చేశారని, కానీ కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం పనులు ఎప్పుడు చేపడతారో, నిధులు ఎంత కేటాయిస్తారో చెప్పలేదన్నారు. కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్‌కు వచ్చిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను రూ.300 కోట్ల నిధులు, ఆర్‌జిబి బ్యాంకును విజయవాడకు తరలించుకుని పోయారని పేర్కొన్నారు. రాయలసీమ అభివృద్ధిని అంతా రాజధానికి తరలిస్తున్నారని, పూర్తిగా మాయమాటలు మాట్లాడారని ఎద్దేవ చేశారు. మోడీ నాయకత్వంలోని బిజెపి, ఎన్డీఏ ప్రభుత్వాలు మరోసారి మాయమాటలతో, అబద్ధాలతో, ఆంధ్రుల ను మోసం చేశారని చెప్పారు. ప్రజల కొనుగోలు శక్తి రోజు రోజుకూ దిగజారి పోతుందని, పౌష్టికాహార లోపాలు పెరుగుతున్నాయని తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రామ్మోహన్, వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాసులు రెడ్డి, బి.దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

అన్నీ అబద్దాలే : పిసిసి

కడప : పది సంవత్సరాలలో అమరావతికి అన్ని రకాలుగా సంపూర్ణ మద్ధతిచ్చాం అని ప్రధాని మోడీ బహిరంగ సభలో చెప్పడం విడ్డూరం పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసి రెడ్డి పేర్కొన్నారు. కడపలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లికి భిక్షం వేసినట్లు పదేళ్లల్లో మోడీ ప్రభుత్వం అమరావతికి ఇచ్చింది కేవలం రూ. 2,500 కోట్లు మాత్రమే అన్నారు. 2015 అక్టోబర్22న రాజధాని అమరావతి నిర్మాణానికి శంఖు స్థాపన చేశారని, ఢిల్లీని మించిన రాజధానిని ఏర్పాటు చేస్తామని చెప్పారని, తరువాత దాని ఊసే ఎత్తలేదని వాపోయారు. చెల్లి పెళ్లి మళ్ళీ మళ్ళీ అన్నట్లు ఒక సారి శంఖు స్థాపన చేసిన దానికి రెండవ సారి శంఖు స్థాపన అవసరమా?, మళ్ళీ పెళ్లికి ఇంత ఆర్భాటం, అట్టహాసం అవసరమా? అని ప్రశ్నించారు. కడప జిల్లా లో సెయిల్ ఆధ్వర్యం లో స్టీల్ ప్లాంట్ నిర్మాణం, దుగరాజ పట్నం ఓడ రేవు తదితర అంశాలను ప్రధాని ప్రస్తావించక పోవడం గర్హనీయం అన్నారు.

రాజధాని నిర్మాణం మోసం

కమలాపురం టౌన్ : రాజధాని పునఃనిర్మాణ ప్రారంభోత్సవం అంతా మోసమని వైసిపి కమలాపురం నియోజకవర్గ బాధ్యులు నరేన్‌రామాంజులరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నరేంద్రమోడీ గతంలో తట్టెడు మట్టి, చెంబుడు నీళ్ళు ఇచ్చిన ఈ సారైనా నిర్మాణానికి భారీగా నిధులు ఇస్తారని ఆశపడ్డారని, కానీ ఎపి ప్రజలకు నిరాశే ఎదురైందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు మోడీని, చంద్రబాబును పొగడటమే తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని వాపోయారు. ప్రత్యేక హోదా ఇస్తేగాని పరిశ్రమలు రావు అని, అవి రాకపోతే సంపద సృష్టించలేరని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలు అమలు ఆశ చూపి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని అటకెక్కించారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉత్తమరెడ్డి, నగర పంచాయతీ కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సాదిక్‌బాష, రాజుపాలెం సుబ్బారెడ్డి, తురకపల్లె రాజశేఖర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, వీరనారాయణరెడ్డి, బయనపల్లె కొండారెడ్డి పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - బద్వేలు : కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగేంద్రబాబు పేర్కొన్నారు. ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించే దేశవ్యాప్త సమ్మెకు నేపథ్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్ వి.వి. నరసింహారెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో స్వాతంత్ర్యం రాక పూర్వమే బ్రిటీష్ కాలం లోనే ప్రాణ త్యాగాలు చేసి పోరాడి సాధించుకున్న హక్కులను ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాసోందని పేర్కొన్నారు. ఉద్యోగ భద్రత లేకుండా కార్మికులను బానిసలుగా మార్చేందుకు కుట్రపన్నుతోందని పేర్కొన్నారు. వేతనాల కోసం బేరసారాలాడే హక్కులను కార్మికులు కోల్పోతారని వాపోయారు. ఇంతటి ప్రమాదకరమైన లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ పట్టణ అధ్యక్షులు పులి శాంప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షులు దియ్యాల హరి, ఉపాధ్యక్షులు గంటా శ్రీనివాసులు, కార్యదర్శి బద్వేల్ ప్రవీణ్ కుమార్, కోశాధికారి కాలువ శివకుమార్, కమిటీ సభ్యులు తేళ్ల కిరణ్, ఇండ్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో 14 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : స్పిరిట్ ప్రాంగణ ఎంపికలో 14 మంది ఉద్యోగాలు సాధించినట్లు అడేసి బై ఛానల్ ప్లే లిమిటెడ్ కంపెనీ రీజనల్ హెడ్ వికాస్ మిశ్రా, స్పిరిట్స్ కళాశాల అధినేత కె.నిర్మల, డైరెక్టర్ ఎం. సి.రవీంద్ర, ప్లేస్ మెంట్ ఆఫీసర్ ఎస్.ఎండి. మునీర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక రిమ్స్ రోడ్డులోని స్పిరిట్స్ కళాశాలలో ఆడేసి బై ఛానల్ లిమిటెడ్ కంపెనీ, స్పిరిట్స్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. దాదాపు 25 నుంచి 30 మంది ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు హాజరయ్యారు. వారందరికీ ఇంటర్వ్యూలు నిర్వహించి 14 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. సంవత్సరానికి రూ. 1,50,000 వేతనంగా అందిస్తారని పేర్కొన్నారు. వేతనంతో పాటు వీరికి కంపెనీ పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు అందిస్తుందని తెలిపారు. వ ఎంపికైన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ నిర్మల, డైరెక్టర్ రవీంద్ర, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ మునీర్ అభినందించారు.

డిఎస్‌సి ఉచిత శిక్షణకు విశేష స్పందన

ప్రజాశక్తి - కడప అర్బన్ : యుటిఎఫ్ కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత డిఎస్‌సి కోచింగ్ పట్ల అభ్యర్థులు విశేష స్పందన కనపరుస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు తెలిపారు. ఉచిత డిఎస్‌సి కోచింగ్ విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. విషయ నిపుణుల చేత బోధన, రోజూ స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని అభ్యర్థులే కాక చిత్తూరు, కర్నూలు, ప్రకాశం, అనంతపురం జిల్లాల నుంచి కూడా శిక్షణ కోసం వస్తున్నారని పేర్కొన్నారు. ఉచిత శిక్షణలో జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ సైకాలజీ బోధిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ కోచింగ్ సెంటర్లలో బోధించే అధ్యాపకుల కన్నా అద్భుతంగా ఇక్కడ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కష్టమైన సబ్జెక్టును ఇష్టమైన రీతిలో బోధిస్తున్నారని చెప్పారు.సోమ, మంగళవారాల్లో ఇంగ్లీష్ మెథడాలజీ బోధిస్తారని అర్హులైన, ఆసక్తి కలిగిన ఎస్‌జిటి, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతిరోజు ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు కోచింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

'సంవిధాన్ అభియాన్ బచావో'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గోపవరం : సంవిధాన్ అభియాన్ బచావోను విజయవంతం చేయలని డిసిసి అధ్యక్షులు విజయ జ్యోతి పిలుపునిచ్చారు. శనివారం బద్వేలు పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారత రాజ్యాంగాన్ని అవమాన పరుస్తూ తప్పుదారి పట్టిస్తున్న ఎన్‌డిఎ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 40 రోజులు జాతీయ రాష్ట్ర నియోజకవర్గ మండల స్థాయిలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంవిధాన్ అభియాన్ బచావో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలకు సంబంధించి వచ్చిన విజ్ఞప్తులను స్థానిక రెవెన్యూ డివిజన్ అధికారిని కలిసి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ బద్వేల్ టౌన్ పట్టణ అధ్యక్షులు నరసింహ, డిసిసి జనరల్ సెక్రెటరీ వై.అచ్యుతరాజు, పిసిసిసభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కానిస్టాంటెన్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి గోపవరం : దళిత బహుజన ఉద్యమ నాయకులు కీ.శే. ఎల్.డి కానిస్టంటెన్ సేవలు మరువలేనివని సీనియర్ దళిత నాయకులు ఒ.ఎస్.వి. ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం బద్వేల్ లోని సంఘమిత్ర కార్యాలయంలో 17వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,పేద బడుగు బలహీనర్గాలకు చెందిన పేదల పక్షాన నిలిచి వారి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ద్వారా వారికి రావాల్సిన రాయితీలపై అవగాహన కల్పించిన మహనీయులన్నారు. అనంతరం కాన్ స్టెన్ టైన్ చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు.

బీమా రంగంలో విదేశీ పెట్టుబడి వద్దు

ప్రజాశక్తి - కడప అర్బన్

బీమా రంగంలో విదేశీ కంపెనీలను అనుమతించవద్దని, ఎల్ఐసి ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని యూనియన్ జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య పిలుపు ఇచ్చారు. డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం కడప జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ ఐఆర్‌డిఎ సంస్థ ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అనుకూలంగా పనిచేస్తోందని, ఎల్ఐసిని బలహీన పరచే ప్రయత్నం చేస్తోందని తెలిపారు. అందరికీ పెన్షన్, పెన్షన్ అప్డేషన్, స్టాగ్నేషన్ ఇంక్రిమెంట్ తాము డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. కొన్ని అలవెన్సుల విషయంలో తమ పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారని వాపోయారు. ఎల్ఐసిలో నూతన రిక్రూట్‌మెంట్ తక్షణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సాధారణ బీమా సంస్థల్ని విలీనం చేయాలన్నారు. బీమా ప్రీమియంపై జిఎస్‌టి తక్షణమే తొలగించాలని, ఈ విషయంలో జాప్యాన్ని ఆయన తీవ్రంగా తప్పు పట్టారు. కార్మిక చట్టాల నిర్వీర్యం ఆపాలని, 80 శాతం పైన సభ్యత్వమున్న ఎఐఐఇఎకి తక్షణం గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై ఈనెల 20 సమ్మెను బ్యాంకు సిబ్బంది, ఇతర కార్మిక వర్గంతో కలిపి జయప్రదం చేయాలని పిలుపు ఇచ్చారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథ రెడ్డి, నాయకులు అక్బర్ బాష, వై.కల్యాణ్, వారిజాతమ్మ, రాజు, అయ్యవారు రెడ్డి, రత్నకిషోర్, రాయచోటి, రాజంపేట, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కడప నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

సైకాలజీ ఉచిత స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- కడప అర్బన్



మెటీరియల్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణ రావు ఆధ్వర్యంలో రూపొందించిన సైకాలజీ స్టడీ మెటీరియల్‌ను శనివారం యుటిఎఫ్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ త్వరలో నిర్వహించనున్న డిఎస్‌సి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని తక్కువ సమయంలో సైకాలజీ సబ్జెక్టును పూర్తిగా అవగాహన చేసుకునే విధంగా అభ్యర్థులకు కోసం మాజీ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు రూపొందించారని తెలిపారు. కృష్ణ, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా 14 సంవత్సరాల పాటు పని చేయడంతో పాటు ఎంతోమంది ఉద్యోగస్తులకు శిక్షణ ఇచ్చి ప్రయోజకులుగా తీర్చిదిద్దిన వ్యక్తి కె ఎస్ లక్ష్మణరావు అని పేర్కొన్నారు. ఆయన నిరంతరం పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు కెరీర్ గైడెన్స్ అందిస్తుంటారని చెప్పారు చెప్పారు. శిక్షణ పొందిన అనేకమంది ఉద్యోగాలను పొందడంతో పాటు సామాజిక సేవలో భాగస్వాములయ్యారని తెలిపారు. ప్రస్తుతం డిఎస్ఇసకి తక్కువ సమయం ఉన్నందువన సైకాలజీలో ఎక్కువ మార్కులు పొందడానికి ముఖ్యమైన అంశాలను పొందుపరుస్తూ చాలా సులభంగా అర్థమయ్యే విధంగా మెటీరియల్ తయారు చేశారని పేర్కొన్నారు. మెటీరియల్ డిఎస్‌సి అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, కావలసినవారు యుటిఎఫ్ కడప జిల్లా శాఖను సంప్రదించి పొందగలరని కోరారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఏజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపీనాథ్, కేదార్నాథ్, నాగిరెడ్డి, ప్రకాష్ బాబు పాల్గొన్నారు.

ఇ-శ్రమ్ కార్డుల పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి - కడప



అవగాహన కల్పిస్తున్న అధికారులు

అసంఘటిత కార్మికులు ఇ-శ్రమ్ కార్డుల పట్ల అవగాహన పెంచుకోవాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారులు శ్రీనివాసులు, శైలజ, పారా లీగల్ వాలంటీర్లు ఈశ్వరయ్య, సురేష్ సహాయం అన్నారు. అసంఘటిత కార్మికుల అవగాహన వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో కడప నగరం అప్సర సర్కిల్‌లో అసంఘటిత కార్మికులకు, వ్యవసాయ, భవన నిర్మాణ, గృహ కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టపరమైన సహాయం, ఆస్తి వివాదాలు, బాల కార్మికులు, ఉద్యోగి-యజమాని సమస్యలు, అసంఘటిత కార్మికులు ఇ-శ్రమ్ కార్డుల పట్ల అవగాహన పెంచుకోవాన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అసంఘటిత కార్మికులసమస్యలను గుర్తించడం వారికి తగు న్యాయ సహాయం అందించడం, ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగు అంశాలపై అవగాహన కలిగించారు. కనీస వేతనాల చట్టం, పని వేళలు మొదలగు వాటిని వివరించారు.ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్, ఇతర నిబంధన చట్టం గురించి తెలియజేశారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప వారి దృష్టికి తీసుకొని రావచ్చును అన్నారు. కార్యక్రమంలో అసంఘటిత కార్మికులు పాల్గొన్నారు.



పాటల ద్వారా అవగాహన కల్పిస్తున్న సమీర్‌బాష

చదువుతోనే మంచి భవిష్యత్తు : జెవివి

ప్రజాశక్తి- కడప అర్బన్

విద్యార్థులు చక్కగా చదువుకుంటేనే వాళ్లకు మంచి భవిష్యత్తు ఉంటుందని, కష్టాలనైనా కన్నీళ్ళనైనా కడతేర్చేది చదువు ఒక్కటేనని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్‌బాష తెలిపారు. కడప జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా శనివారం గ్రంథాలయ సెక్రెటరీ అమీరుద్దీన్ పర్యవేక్షణలో విద్యార్థులకు పాటలు, యోగా, డ్యాన్స్ విషయాల మీద తరగతులు నిర్వహించారు. ఈ సదంర్భంగా జెవివి జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ చదువుకోవడం వల్ల జ్ఞానం కలుగుతుందని, జ్ఞానం వల్ల లక్ష్య సాధన దిశగా ముందుకు వెళ్లి గమ్యాన్ని చేరుకోవచ్చు అని పాట రూపంలో పాడి వినిపించారు. బడి అంటే జైలు అనే భయాన్ని వదిలి, బడి అంటే అమ్మ ఒడిగా భావించి ప్రతి ఒక్కరూ పాఠశాలకు వెళ్లి బాగా చదువుకోవాలని, అంబేద్కర్ చక్కగా చదువుకుని గొప్పవారైనారని పేర్కొన్నారు. భారత రాజ్యాంగాన్ని రాసి బాబా సాహెబ్ అయ్యారని తెలిపారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ భారతి యోగాభ్యాసం, ఆసనాలు ఎలా వేయాలి ? అవి వేసేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి అనే విషయాల మీద విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాన్స్ టీచర్ వర్షిని విద్యార్థులకు డ్యాన్స్‌లోని మెలకువలు నేర్పించారు. కార్యక్రమంలో లైబ్రరీ సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి షూటింగ్ పోటీలకు ఎంపికలు

ప్రజాశక్తి - కడప

లక్ష్యంపై దృష్టి, శ్వాసపై నియంత్రణ, ఆయుధంపై పట్టు మంచి ఫైరర్‌కు ఉండాల్సిన లక్షణాలు అని 30 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి కమాండింగ్ అధికారి కల్నల్ ఎన్. సూర్యనారాయణ మూర్తి అన్నారు. తెలుగు గంగ కాలనీలో జరుగుతున్న ఒకటవ కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం ఎన్‌సిసి క్యాడెట్లకు ఫైరింగ్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో ప్రతిభ కనబరిచిన కేడెట్లను ఈనెల 13 నుండి రాష్ట్రస్థాయిలో జరిగే ఇంటర్ డైరెక్టరేట్ షూటింగ్ పోటీలకు ఎంపిక చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ గ్రూప్ కెప్టెన్ ఆర్.జె. ఆత్రే, ఎన్‌సిసి అధికారులు కెప్టెన్ డాక్టర్. నీలయ్య, శివరాం, పసుపుల రాజశేఖర్, జగదీష్, సురేంద్ర నాయక్ పరేడ్ శిక్షణ అధికారులు సుబేదార్ మేజర్ అనిల్ కుమార్, రూపేంద్ర జిత్ సింగ్, సి.ఎల్. రెడ్డి, కొండా రెడ్డి , గర్ల్ కేడెట్లు ఇన్‌స్ట్రక్చర్ మిశ్రా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు ఇవ్వాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

వేసవి సెలవులలో పదవ తరగతి తప్పిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఆదేశాలు జారీ చేశారే కానీ, ఆ ఉత్తర్వులలో సంపాదిత సెలవు లేకుండా (ఎర్న్‌లీవ్స్) ఇవ్వడం అంటే నిర్బంధ నియంతృత్వ ఉత్తర్వులే అని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎసివి గురువారెడ్డి, వైఎస్ఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వి.సుబ్బారెడ్డి, ఎన్.వి .సుబ్బారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాశాఖ సంబంధించిన ప్రతి అధికారి ఎసి రూముల్లో, ఏసీ కార్లలో తిరుగుతూ అన్ని రకాల అలవెన్సులు, సంపాదిత సెలవులు పొందుతూ ఉపాధ్యాయులతో మాత్రం వెట్టిచాకిరి చేయించడం సరైందని కాదని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు వెకేషన్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఉద్యోగులు అని, వేసవి సెలవులు అనేక కార్యక్రమాలు ముందుగానే రూపొందించుకుని ఉంటారన్నారు. వేసవి సెలవుల లో పని చేస్తే జీవో 35 ప్రకారం సంపాదిత సెలవులు ఇవ్వాలని విద్యా శాఖ అధికారులకు తెలియదా అని తెలిపారు.

నగరంలో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి- కడప అర్బన్

ఎస్పి ఇ.జి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు కడప వన్ టౌన్ పరిధిలోని గుర్రాలగడ్డ, బ్రాహ్మణ వీధిలో శనివారం పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల ఇళ్లల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. కడప వన్ టౌన్ సి.ఐ బి.రామకృష్ణ, ఎస్ఐలు అమర్‌నాథ్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, తాలూకా ఎస్ఐ తులసి నాగ ప్రసాద్, సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు. రికార్డులు లేని 9 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు నీట్ పరీక్ష

- జిల్లా వ్యాప్తంగా 8 పరీక్షా కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 2428 మంది విద్యార్థులు
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు

ప్రజాశక్తి - కడప : జిల్లాలో ఈ నెల 4న నీట్ యూజీ- 2025 పరీక్ష నిర్వహించనున్నారు. కడపలో 6, ప్రొద్దుటూరులో 2 మొత్తం ఎనిమిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో జరగనుంది. మొత్తం 2428 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. పరీక్షకు సంబంధించి జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా సిద్ధం చేశారు. నీట్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఎన్‌టిఎ సూచించిన నియమ నిబంధనలను తప్పని సరిగా పాటించాల్సి ఉంటుంది. ఉదయం 11 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. అభ్యర్థులు నీట్ యూజీ నియమ నిబంధనలను తప్పక పాటించాలని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రంలో ఫోటో ఐడిలలో ఏదైనా వెంట తీసుకెళ్లాలి. ఒరిజినల్ పాన్ కార్డ్, డ్రైవింగ్ లైసె న్స్, ఓటరుఐడి, పాస్‌పోర్ట్, ఆధార్‌కార్డ్, రేషన్‌కార్డులలో ఏదైనా ఒకటి తీసుకెళ్లవచ్చు.

6న డయల్ యువర్ డిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆర్‌టిసి సమస్యలపై 'డయల్ యువర్ డిపో మేనేజర్ కడప' కార్యక్రమం ఈనెల 6న నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ డిల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌టిసి కడప డిపో మేనేజర్ కార్యాలయంలో సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ప్రజలు, ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు, సలహాలు 9959225774 సెల్ నంబరుకు ఫోన్, లేదా వాట్సాప్ చేయాలని తెలిపారు సదవకాశాన్ని జిల్లాలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నిరుత్సాహం

ప్రజాదృష్టి

జిల్లాలో చోటుచేసుకున్న ఇటీవలి పరిణామాలు నిరుత్సాహాన్ని కలిగించాయి. సిపిడబ్ల్యు స్కీమ్ టెండర్లు ఓపెన్ చేయడం మొదలుకుని ప్రధానమంత్రి మోడీ అమరావతి పర్యటన సందర్భంగా ఎటువంటి ప్రోత్సహాన్ని కలిగించని వాతావరణం, ఎర్రచందనం స్మగ్లింగ్ ఊపందుకోవడం వంటి పరిణామాలను పరిశీలిస్తే ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలోని రూ.17.90 కోట్ల విలువ కలిగిన 13 సిపిడబ్ల్యు స్కీమ్‌ల టెండర్ల ఓపెనింగ్ గోప్యతను పాటించడంపై విమర్శల వర్షం కురుస్తోంది. ఆర్‌డబ్ల్యుఎస్ మార్గదర్శకాల ప్రకారం టెండరు దక్కించుకున్న గుత్తేదారుల ఏజెన్సీ పేర్లను వెల్లడించకపోవడం ఏమిటనే వాదన వినిపిస్తోంది. సిపిడబ్ల్యు స్కీముల కాంట్రాక్టులను సమర్థత కలిగిన వారికి అప్పగిస్తే తాగునీటి సరఫరా వ్యవహారాలను సజావుగా సాగు తాయనడంలో సందేహం లేదు. అధికార పార్టీకి చెందిన కీలక నేతల ఆగడాలకు లోబడితే సాగునీటి సరఫరా వ్యవస్థ నాసిరకంగా సాగు తుందనడంలో సందేహం లేదు. ఫలితంగా నేతల అనుయాయులకు కట్టబెడితే 553 పంచాయతీ పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి సరఫరా చేయడంలో ఇబ్బందులు ఎదురవుతాయనడం సందేహం లేదు. ఫలితంగా జిల్లాలోని 13.51 లక్షల మంది గొంతు ఎండుతుందనే వాస్తవాన్ని గ్రహించాలి. అమరావతి పునఃప్రారంభానికి విచ్చేసిన ప్రధాని మోదీ రాజధాని అభివృద్ధికి సంబంధించి ఎటువంటి సహాయాన్ని ప్రకటించకపోవడం నిరుత్సాహాన్ని కలిగించింది. దీనిపై సిపిఎం ఆధ్వర్యంలో నిరసనలు వెల్లువెత్తడం గమనార్హం. భారతీయ సమాజంలో ఏదైనా మంగళకరమైన శుభ కార్యక్రమాలు, ఉత్సవాల్లో పాల్గొనడానికి వెళ్తున్న సందర్భంగా ఫలమో, పత్రమో తీసుకెళ్లడం భారతీయ సంప్రదాయం. ఇటువంటి కనీస సంప్రదాయాన్ని పాటించకపోవడం సంప్రదా యవాదులకు సైతం విస్మయాన్ని కలిగిస్తోంది. జిల్లాలో ఇటీవల ఎర్రచందనం దుంగలు పట్టుబడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. మళ్లీ ఎర్రచందనం స్మగ్లింగ్ మాఫియా కార్యకలాపాలు ఊపందుకున్నాయా అనే సందేహం నెలకొంది. స్మగ్లింగ్ కార్యకలాపాలను అరికట్టడంలో భాగంగా ఫారెస్ట్‌శాఖలోని ఖాళీలను భర్తీ చేయడం, గస్తీని ముమ్మరం చేయడం, ఆయుధపరమైన అవసరాలను తీర్చడంపై పాలకులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు. కేంద్రం కొప్పర్తి పారిశ్రామికవాడలో భారీ పారిశ్రా మికనోడ్ ఏర్పాటుకు ఆమోదం తెలపడం సంతోషాన్ని కలిగించి ంది. భారీ పారిశ్రామిక నోడ్ ఏర్పాటుకు సంబంధించి నిక్‌డిక్ట్ అనే కేంద్ర సంస్థతో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం శుభసూచ కం. దీంతోపాటు కొప్పర్తి పారిశ్రామికవాడకు పర్యావరణ అనుమతి మంజూరు చేయడం, బ్రహ్మంసాగర్ నుంచి రూ.150 కోట్లతో తల పెట్టిన తాగునీటి పైప్‌లైన్ పనుల పూర్తి చేయడం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు పూచీ పడినప్పుడే సార్థకత ఏర్పడుతుందని గ్రహించాల్సి ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జెవివి, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

6, 7న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ఎంసెట్ మోడల్ పరీక్ష

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఈనెల 6,7 తేదీల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు ఎస్‌విడిసి అటానమస్ డిగ్రీ కళాశాలలో మోడల్ ఎంసెట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాహుల్ తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు విద్యార్థులచే శనివారం పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్ మోడల్ ఎంసెట్ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రముఖ విద్యావేత్తలచే ప్రశ్నపత్రాన్ని తయారు చేయించామన్నారు. జిల్లాలో ప్రతి ఏడాది ఈ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఎంసెట్ కోచింగ్ విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. వివరాలకు 82977 62173ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు అభినయ్, ఎంసెట్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్తుల విలువ పెంచుకునేందుకే ఆర్భాటం

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎస్.శివమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అమరావతిలో తమ ఆస్తుల విలువ పెంచుకునేందుకే ఈ ఆర్భాటమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎస్.శివమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో కూటమి ప్రభుత్వాన్ని విమర్శించారు. కూటమి నేతలు అమరావతిలో పెట్టే శ్రద్ధ వెనుకపడిన రాయలసీమ ప్రాంతానికిచ్చిన కడప స్టీల్‌ప్లాంట్‌పై ఆలోచించకపోవడం దారుణమన్నారు. కనీసం గుర్తుకైనా ఉందా ఈ కూటమి ప్రభుత్వానికి అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి ప్రజలను ఏమాత్రం పట్టించుకోవడంలేదన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాగేశ్వర నాయక్

ప్రయివేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - ముద్దనూరు

విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అయిదేళ్లు నిండిన పిల్లలను ప్రయివేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు ప్రారంభమయ్యాయని ఎంఇఒ నాగేశ్వర నాయక్ తెలిపారు. స్థానిక ఎంఇఒ కార్యాలయంలో శనివారం నాగేశ్వర నాయక్ ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనాధ పిల్లలు, హెచ్‌ఐవి బాధితులు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ, ఒసి కుటుంబాల గ్రామీణ ప్రాంత పిల్లలు చేరవచ్చన్నారు. సంవత్సర ఆదాయం రూ.లక్ష 20వేలు, పట్టణ ప్రాంతాల వారికి సంవత్సరాదాయం రూ.లక్ష 44వేలు మించరాదన్నారు. అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంఇఒ కోరారు. విద్యార్థి, తండ్రి ఆధార్ కార్డులు, విద్యార్థి వయస్సు ధ్రువీకరణ పత్రం జత చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సిఆర్‌పి తిరుపతయ్య పాల్గొన్నారు.

ఎఒకు ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - సింహాద్రిపురం



ఎంపిడిఒ పి.శ్రీనివాస్‌రెడ్డి

సింహాద్రిపురం ఎంపిడిఒ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న పి.శ్రీనివాస్ రెడ్డికి ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి లభించింది. ఆ మేరకు శనివారం ఉన్నతాధికారులు ఆయనను పులివెందుల ఎంపిడిఒగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది ఎంపిడిఒ కార్యాలయంలో శ్రీనివాస్‌రెడ్డి ఎఒగా బాధ్యతలు చేపట్టారు. అనతి కాలంలోనే మండల ప్రజల మన్ననలను పొందారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా విధులు నిర్వహించారు. పదోన్నతి రావడం పట్ల ఆయనను పలువురు అభినందించారు.

క్రైం కార్నర్

బొలెరో వాహనం బోల్తా

- ఒకరు మృతి, పలువురికి గాయాలు

ప్రజాశక్తి - దువ్వూరు

మండలంలోని చింతకుంట గ్రామ సమీపంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. మైదుకూరు మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన కొంతమంది మొక్కుబడి తీర్చుకునే నిమిత్తం నంద్యాల జిల్లా అహోబిలం దేవస్థానం వెళ్లి తిరిగి వస్తుండగా చింతకుంట గ్రామం వద్ద వారు ప్రయాణిస్తున్న బొలెరో వాహనం అదుపు తప్పి పల్టీలు కొట్టింది. డ్రైవర్ నిర్లక్ష్యంతో వేగాన్ని నియంత్రించలేకపోయాడు. వాహనం రోడ్డుకు పక్కకు పల్టీలు కొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు. ప్రమాదంలో అయిదుగురు పెద్దలు, ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన కానే చిన్న కొండమ్మ (45) అనే మహిళ మృతి చెందింది. గాయపడిన వారిలో కొందరిని కడప రిమ్స్‌కు, మరికొందరిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



అదుపుతప్పి బోల్తా పడిన వాహనం

నిరుపయోగంగా రైతుబజార్

వాణిజ్య సముదాయంలో తెరుచుకోని గదులు - కొరవడిన వసతులు - స్టాల్స్ పెట్టుకునేందుకు ఆసక్తి చూపని వైనం - రూ.1.50 కోట్ల ప్రజాధనం వృథా



ప్రజాశక్తి - పులివెందుల టౌన్

తాము పండించిన కూరగాయలు, పండ్లను రైతులు అమ్ముకుని దళారి వ్యవస్థను రూపుమాపేందుకు రైతుబజార్‌ను నిర్మించారు. రైతు బజార్ నిర్వహిస్తూంటే ప్రజలకు కూడా కూరగాయలు తక్కువ ధరలకే విక్రయిస్తారు. ఆ లక్ష్యంతో నిర్మించిని రైతు బజార్ నిరుపయోగంగా ఉంది. పులివెందుల మార్కెట్ యార్డు వద్ద గత ప్రభుత్వ హయాంలో మార్కెట్ యార్డులో రూ.1.50 కోట్ల వ్యయంతో రైతు బజారు నిర్మించారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావడంతో మిగిలిన పనులు పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకొచ్చారు. కూరగాయల షెడ్లతోపాటు వాణిజ్య సముదాయం నిర్మించారు. రైతు బజారును 2024 జనవరి 17న కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభించారు. గతంలో కేవలం నాలుగైదు రోజులు మాత్రమే ఇక్కడ కూరగాయల విక్రయాలు జరిగాయి. ఆ తర్వాత ఒక్కరు కూడా ఈ రైతుబజారు వైపు కన్నెత్తి చూడకపోవడంతో నిరుపయోగంగా మారింది. మున్సిపల్ అధికారులు పట్టణంలోని రంగనాయకుల గుడి కాంప్లెక్స్‌లో మార్కెట్ నిర్వహిస్తున్నారు. కొన్ని పెద్ద కూరగాయల అంగళ్లు మాత్రం పట్టణంలోని రంగనాయకుల స్వామి గుడి సమీపంలోని మార్కెట్ వారపు సంత నిర్వహిస్తున్నారు. బస్టాండు సర్కిల్‌లో చిరు వ్యాపారస్తులు ఇప్పటికీ విక్రయాలు నిర్వహిస్తున్నారు. పాత మార్కెట్‌లో మాత్రం అధికారులు రాజకీయ వత్తిళ్ల కారణంగా తొలగించలేదు. పట్టణంలో ప్రధాన రహదారులలో రోడ్డు వైపు స్థలాలు ఆక్రమించుకుని కొందరు కూరగాయల వ్యాపారం చేసుకుంటున్నా, వారిని కూడా అధికారులు తొలగించలేదు. దీంతో ప్రస్తుతం వారపు సంత జరిగే ప్రాంతంలో వ్యాపారులు లేక ప్రజలు రాక చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కూరగాయల విక్రయాలు పూర్తిగా వారపుసంత జరిగే ప్రదేశంలోకి తరలించడంతోపాటు ప్రజాధనంతో నిర్మించిన రైతు బజారులో రైతులు కురగాయల విక్రయించేలా చర్యలు తీసుకోవాలని చిరు వ్యా పారులు, ప్రజలు కోరుతున్నారు.

ప్రణాళిక లేకుండా నిర్మాణాలు..

ఎలాంటి ప్రణాళికలు లేకుండా రైతు బజారు నిర్మించడంతో ఇక్కడికి మారేందుకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. కాంట్రాక్టు తీసుకున్న వైసిపి నాయకులు నిధుల విషయంలో చూపిన ఆసక్తి నిర్మాణంలో చూపడంలేదన్న విమర్శలున్నాయి. తూతూ మంత్రంగా నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేయడంతో మార్కెట్ సముదాయంలో ఏర్పాటు చేసిన దుకాణాలు ఎందుకు పనికిరావన్నది అర్థమవుతోంది. పట్టణంలోని పాత రంగనాథస్వామి మార్కెట్లో అంగళ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారం సాగిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. కొత్తగా నిర్మించిన మార్కెట్ లోపలికి ఉన్నందున కొనుగోలుదారులు ఇక్కడికి వచ్చే అవకాశం లేదని వ్యాపారులు వాపోతున్నారు. వ్యాపారం లేకపోతే తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని నిరుపయోగంగా ఉన్న మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకోరావాలని వ్యాపారులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి ఆదాయాన్ని పెంచుతాం..

రైతు బజార్‌ను వినియోగంలోకి తీసుకొచ్చి ప్రభుత్వానికి ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతులు తమ పంటను వారే అమ్ముకునేలా చర్యలు తీసుకుంటాం. స్థానికులకు తక్కువ ధరకే కూరగాయలను అందించడానికి కృషి చేస్తున్నాం.

- శ్రీధర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ కార్యదర్శి

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు : డిపిఒ



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డిపిఒ రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె మేజర్ గ్రామ పంచాయతీలో గత రెండు నెలలుగా ఇఒ లేకపోవడంతో పారిశుధ్యం, డ్రెయినేజీ వ్యవస్థలు అస్తవ్యస్తంగా తయారయ్యాయని ఫిర్యాదులు వచ్చాయని, ఆ మేరకు వారం రోజులపాటు స్పెషల్ డ్రైవ్ (ప్రత్యేక చర్యలు) చేపడుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. శనివారం వేంపల్లె గ్రామ పంచాయతీలో పారిశుధ్య పనులపై డిపిఒ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెన్నూరు, ఖాజీపేట, నందిమండలం తదితర పంచాయతీల నుండి 30 మంది పారిశుధ్య సిబ్బందిని తీసుకొచ్చి చెత్తను తొలగింపు చర్యలు చేపట్టామన్నారు. స్థానిక కడప మెయిన్ రోడ్డులోని బాలుర ప్రభుత్వ పాఠశాల, నాలుగు రోడ్ల కూడలి, హనుమాన్ జంక్షన్ ప్రాంతాల్లో పనులు చేపట్టామన్నారు. వారంలోపు గ్రామంలో ఎక్కడ కూడా చెత్త, చెదారం లేకుండా చూస్తామని చెప్పారు. ప్రజలు కూడా పారిశుధ్యంపై అవగాహన ఉండా లన్నారు. ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై చెత్త వేయరాదన్నారు. వేంపల్లెలో నీటి సమస్య లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ హరికృష్ణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అపరిశుభ్రంగా లోతట్టు ప్రాంతాలు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో పలు లోతట్టు ప్రాంతాలు వర్షపు నీటితో చెరువులను తలపిస్తున్నాయి. వర్షపు నీరు వంకలు, ఇతర ప్రాంతాలకు ప్రవహించే ఏర్పాటు లేకపోవడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అవుతున్నాయి. ముఖ్యంగా కడప రోడ్డులోని సాయినాథపురం, బద్వేల్ రోడ్డులోని సుందరయ్యకాలనీ వద్ద నీరు అధికంగా నిలుస్తోంది. బద్వేల్ రోడ్డులోని జోసఫ్‌పేట, శాంతి నగర్, మహబూబ్ నగర్, మార్కెట్ రోడ్డు, కడప రోడ్డులోని మసీదు రోడ్డు, రిజిస్టర్ కార్యాలయం రోడ్డు, బస్టాండ్, నంద్యాల రోడ్డు, ప్రొద్దుటూరు రోడ్డులోని కెసి కాలువల వద్ద నీటి కుంటలు తయారయ్యాయి. వీటిల్లో పందుల బెడద తీవ్రగా ఉంది. మున్సిపాలిటీ పరిధిలో 120 వరకు నిల్వ ఉండే మురుగు కుంటలు ఉన్నట్లు ఆరోగ్య శాఖ సిబ్బంది గుర్తించారు. మురుగు కుంటల్లో దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. మురుగు కుంటలను ఆదారం చేసుకొని పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రధాన రహదారి వెంబడి పందులు ఒక్కసారిగా రోడ్డు దాటుతుంటుంటాయి. ద్విచక్ర వాహనదారులు వాటిని ఢీకొని ప్రమాదాలకు గురైన సందర్భాలు కోకొల్లలు. మున్సిపాలిటీ అధికారులు పలు దఫాలు పందుల యజమానులు పిలిపించి మాట్లాడినప్పటికీ ఉపయోగం లేదు. అందులో పందుల యజమానులను మునిసిపాలిటీ వర్కర్లుగా విధుల్లోకి తీసుకుంటామని ఖచ్చితమైన హామీ లేకపోవడంతో వారు పందుల పెంపకాన్ని వదిలేయడం లేదు. అయితే వాటిని ఒక చోట సంరక్షించుకోకుండా ఇష్టానుసారంగా వదులుతున్నారు. అవి మురికి కుంటలలో తిరుగుతూ దుర్వాసన వెదజల్లుతు రోగాలకు కారణమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులలో ఉన్న లోతట్టు ప్రాంతాలను గుర్తించి వర్షపు నీరు నిలవకుండా జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అపరిశుభ్రంగా కడప రోడ్డులోని లోతట్టు ప్రాంతం

అగ్నిప్రమాదంలో గోనె సంచులు దగ్ధం

- కాలిపోయిన మోటర్ బైక్, తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - వేంపల్లె



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పులివెందుల రోడ్డులోని కందుల కాంప్లెక్స్ వెనుక ఉన్న రేకుల షెడ్‌లో గోనె సంచులు కాలిపోయాయి. రేకుల షెడ్ పక్కన ఉన్న మరో రేకుల షెడ్‌లో ఆక్సిజన్‌కు చెందిన సిలిండర్లు ఉండడంతో మంటలను అదుపు చేయడంతో పెనుప్రమాదం తప్పింది. ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కందుల కాంప్లెక్స్ వెనుక కూరగాయల వ్యాపారులు షెడ్లు వెసుకొని వాటిలో పాత గోనెసంచులు, టమోటా ట్రెలు పెట్టుకున్నారు. శనివారం గోనె సంచులు ఉన్న రేకుల షెడ్డులో మంటలు వస్తున్న విషయాన్ని స్థానికులు గమనించి ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి ఫైర్ సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పారు. మంటలను అదుపు చేయడం వల్ల పక్కనే ఉన్న మరో రేకుల షెడ్‌లో రోగులకు, ఆస్పత్రులకు సప్లయ్ చేసే ఆక్సిజన్‌కు ప్రమాదం తప్పింది. మంటలను అదుపు చేయడంతోపాటు సిలిండర్లపై నీటిని చల్లారు. ఎండలు తీవ్రంగా ఉండడంతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు స్థానికులు, ఫైర్ సిబ్బంది చాలా కష్టపడ్డారు. మంటల్లో మోటర్ బైకు కూడా కాలిపోయింది. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ శివరామిరెడ్డి, సిబ్బంది ఎస్ఎండి సాలర్, మహమ్మద్ రఫీ, సురేంద్రరెడ్డి, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



మంటల్లో కాలి పోయిన మోటర్ బైకు



మహాభారతంపై అవగాహన కల్పిస్తున్న క్రిష్ణారెడ్డి

మహాభారతంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - చాపాడు

శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులకు శనివారం మహాభారతంపై స్థానికులు క్రిష్ణారెడ్డి అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారి జె.శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిరోజు ప్రత్యేక అంశాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీపెద్దమ్మతల్లి దేవర

ప్రజాశక్తి - సింహాద్రిపురం



సింహాద్రి పురంలో శ్రీపెద్దమ్మతల్లి దేవరను వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి దేవర ఉత్సవాలతో ప్రధాన వీధులు రద్దీగా తయారయ్యాయి. ముందుగా అమ్మవారిని ఆలయ అర్చకులు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. దేవర ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయం విద్యుద్దీపాలతో కొత్త శోభను సంతరించుకుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సిఐ ఎన్‌వి రమణ పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ పర్యవేక్షణలో ముగ్గురు సీఐలు, ఐదు మంది ఎస్‌ఐలు, 90 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.

8 నుంచి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి - వేంపల్లె



ఎంఇఒ స్టాలిన్ ఐజాక్

పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈనెల 8వ నుండి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ స్టాలిన్ ఐజాక్ తెలిపారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిఇఒ ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ బాలుర, బాలికల, ఉర్దూ పాఠశాలలతోపాటు ఆయా పాఠశాలల విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. మూడు పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులకు హాజరై తమ సబ్జెక్టులను బోధిస్తారని వివరించారు. రాబోయే పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేందుకు సన్నద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక తరగతులకు వచ్చే మూడు విద్యార్థులకు మంచినీటి సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు అందరూ ఉర్దూ, జిల్లా పరిషత్ బాలుర, బాలికల పాఠశాలలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ కోరారు.

రేపటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

భారత దేశంలో ఆధార్ ఒక విశిష్ట గుర్తింపు కార్డు. ఈ ఆధార్ కార్డుతో ప్రజలు చాలా రకాల ప్రభుత్వ పథకాలు పొందుతున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఆధార్ కార్డులు ఇంకా చాలా వరకు బయోమెట్రిక్ అప్డేషన్, డాక్యుమెంట్స్ అప్డేషన్ పెండింగ్ ఉన్నందున ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఆధార్ స్పెషల్ క్యాంప్స్ టైం షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈనెల 5నుంచి 8వ తేదీ వరకు, 12 నుండి 15 వరకు పులివెందుల పురపాలక సంఘ పరిధిలోని నిర్దేశించిన సచివాలయాల్లో సదరు సచివాలయ పరిధిలోని అంగన్వాడీ సెంటర్లలోని బాల బాలికలకు ఆధార్ నమోదు నిర్వహించనున్నారు.

5న పెద్దరంగాపురం సచివాలయం, 6న సియోనుపురం సచివాలయం, 7న బయమ్మతోట సచివాలయం, 8న మిస్సమ్మ బంగ్లా సచివాలయంలో, 12న గుంత బజార్, వెంకటాపురం సచివాలయం, 13న భాకరాపురం, ప్రశాంతి నగర్ సచివాలయం, 14న నగరిగుట్ట, అంకాళమ్మపేట సచివాలయం, 15న రాజీవ్ కాలనీ, పెద్దకొండప్ప కాలనీ సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాలు పనిచేస్తాయని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చాపాడు : ఆధార్ కార్డులలో వివిధ రకాల సమస్యలు ఉన్నవారు ఈనెల 5 నుంచి మండలంలోని పలు గ్రామాలలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ వీరకిషోర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకు, 12 నుంచి 15వ తేదీ వరకు 8రోజులపాటు ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పేరు మార్పు, పుట్టినతేదీ, అడ్రస్ మార్పుల వంటి సమస్యలు ఉన్నవారు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 5న మడూరు, 6న అన్నవరం, 7న చియ్యపాడు, 8న సోమాపురం గ్రామాల్లో ఆధార్‌క్యాంపులు ఏర్పాటు చేశామని ఎంపిడిఒ వీరకిషోర్ వివరించారు.



బుజ్జి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి

మాజీ వార్డు మెంబర్ మృతి

వేంపల్లె : వేంపల్లె గాజుల పేటకు చెందిన మాజీ వార్డు మెంబర్, వైసిపి కార్యకర్త పోలేపల్లి బుజ్జి శనివారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందాడు. ఛాతిలో నొప్పి రావడంతో ప్రయివేట్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెం దినట్లు డాక్టర్లు పేర్కొన్నారు. బుజ్జి మృతి పట్ల పలువురు వైసిపి నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జడ్పీటీసీ రవి కుమార్ రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆర్ఎల్‌వి ప్రసాద్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కొత్తూరు రెడ్డయ్య, వార్డు మెంబర్లు పోలేపల్లి గణేష్, ముత్యాల ఆంజనేయులు పాల్గొన్నారు.